ప్రజాశక్తి
గురువారం 18 మే 2023 5
పార్వతీపురం మన్యం

గురుకులాల్లో ప్రవేశాలకు 20న పరీక్ష : డిఇఒ

కలెక్టరేట్ : గురుకులాల్లో ప్రవేశాలకు ఈనెల 20 ప్రవేశ పరీక్షలు జరగనున్నాయని జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్ కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిఆర్ఎస్ క్యాట్, ఏపి ఆర్ జె సి, డిసి పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. పరీక్షలకు హాజరయ్యే 5,6,7,8 తరగతుల అభ్యర్థులు aprs.apcfss.in/studentiogin.do వెబ్ సైట్ నుండి, ఇంటర్, డిగ్రీకి సంబంధించిన వారు aprs.apcfss.in/APRJC Inter Student.ogin.do వెబ్ సైట్ నుండి అభ్యర్థుల ఐడి నెంబరు, పుట్టిన తేదీ నమోదు చేసుకుని హాల్ టికెట్లను డౌన్లోడ్ చేసుకోవచ్చునన్నారు. హాల్ టికెట్లకు సంబంధించి సందేహాలు ఉంటే జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో సంప్రదించగలరని తెలిపారు. పరీక్ష ఉదయం10 గంటలకు జరుగుతుందని, అభ్యర్థులు 9.30లకు పరీక్షా కేంద్రాలకు రావాలని సూచించారు. మధ్యాహ్నం 2.30 గంటలకు ఎపిఆర్జెసి, డిసిపరీక్షకు అభ్యర్థులు 2 గంటలకు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని ఆ ప్రకటన లో తెలిపారు.

రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా

అభివృద్ధిని తాకట్టుపెట్టిన నేతలు

ప్రజాశక్తి - సాలూరు

స్వార్ధ రాజకీయ ప్రయోజనాలే పరమావధిగా పని చేస్తున్న నియోజకవర్గ ప్రజాప్రతినిధులు ఏజెన్సీ ప్రాంత అభివృద్ధిని తాకట్టు పెడుతున్నారన్న విమర్శలు సర్వత్రా వినిపిస్తున్నాయి. వెనుకబడిన ప్రాంతమైన నియోజకవర్గాన్ని అలాగే ఉంచాలని లక్ష్యంతో ఎన్నికైన ఎమ్మెల్యేలు ఇంతవరకు పని చేశారనే స్పష్టంగా కనిపిస్తోంది. గిరిజన నియోజకవర్గంలో చెప్పుకోదగిన అభివృద్ధి పనులంటూ ఏవీ లేవు. నియోజకవర్గం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు ఈ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణతో పని చేసిన దాఖలాల్లేవు. 1980 తర్వాత నియోజకవర్గంలో ఎక్కువగా టిడిపి, కాంగ్రెస్, వైసిపి ఎమ్మెల్యేలే గెలుపు సాధించారు. గిరిజన ఎమ్మెల్యేలు కావడంతో జిల్లా రాజకీయాలను శాసించే స్థాయిలో ఉన్న సామాజిక వర్గానికి చెందిన నేతల కనుసన్నల్లో వ్యవహరించడమే తప్ప స్వతంత్రం పని చేసిన దాఖలాల్లేవు. తమ నియోజకవర్గ అభివృద్ధికి పలానా పనులు మంజూరు చేయాలని గాని, మంజూరు చేయించిన సందర్భాలు గాని లేవు. విద్య, వైద్య రంగాల్లో అభివృద్ధి చెందిన ప్రాంతం మిగిలిన అన్ని రంగాల్లోనూ పురోగతి సాధించడానికి అవకాశం ఏర్పడుతుంది. వెనుకబడిన ఈ ప్రాంతంలో ప్రగతి సాధించడానికి తగిన అవకాశం లభించినా వినియోగించుకోలేని దుస్థితిలో స్థానిక ప్రజాప్రతినిధులు వున్నారనేది తేటతెల్లమైంది. గత టిడిపి ప్రభుత్వం హయాంలో నియోజకవర్గ పరిధిలోని పాచిపెంట మండలంలోని మాన్సాస్ భూముల్లో గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. రెండు సార్లు అధికారుల కమిటీ, మంత్రుల కమిటీ ఈ భూములను పరిశీలించింది. వారంతా భూములు పరిశీలించే సరికి గిరిజన యూనివర్సిటీ ఏర్పాటవుతుందని నియోజకవర్గ ప్రజలు ఆశలు పెట్టుకున్నారు. ఊరించిన తర్వాత చివరికి కొత్తవలస దగ్గర రెల్లి గ్రామానికి తరలించారు. అప్పుడు నియోజకవర్గ టిడిపి నాయకులైన సంధ్యారాణి, భంజ్

దర్గసాగరం వద్ద స్థల పరిశీలన చేస్తున్న కేంద్రకమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు (ఫైల్)

- నాడు టిడిపి...నేడు వైసిపి
- గిరిజన వర్సిటీ తరలింపు వెనుక రియల్ లాబీయింగ్

దేవ్ గిరిజన యూనివర్సిటీని పాచిపెంటలో ఏర్పాటు చేయాలని ఒక్క మాట చెప్పలేకపోయారు. కొత్తవలస కు తరలిపోతే కిమ్మనకుండా మౌనం వహించారు. ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతంలో మావోయిస్టుల ప్రభావం వుంటుందనే సాకుతో యూనివర్సిటీని తరలించారు. 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత యూనివర్సిటీ తరలింపు ప్రతిపాదన తెరపైకి వచ్చింది. ఆయన పాదయాత్ర సందర్భంగా సిఎం జగన్ మోహన్ రెడ్డి పట్టణంలోని బహిరంగ సభలో మాట్లాడుతూ గిరిజన యూనివర్సిటీ గిరిజన ప్రాంతంలో ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. దానికి తగినట్లుగానే కొత్తవలస నుంచి సాలూరు ప్రాంతంలో ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. సాలూరు, రామభద్రపురం మండలాల పరిధిలో గల భూములను యూనివర్సిటీ ఏర్పాటుకు పరిశీలించారు. సెంట్రల్ యూనివర్సిటీ అధికారుల బందం, ఎమ్మెల్యేలు రాజన్నదొర, శంబంగి వెంకట చిన అప్పలనాయుడు, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి పుష్పశ్రీవాణి దుగ్గ సాగరం భూములను పరిశీలించారు. యూనివర్సిటీ ఏర్పాటుకు అవసరమైన ప్రభుత్వ భూములు అందుబాటులో ఉన్నా గాని సెంట్రల్ యూనివర్సిటీ అధికారుల బందం తిరస్కరించింది. భూములు సమతలంగా లేవని సాకు చూపించి మెంటాడ, దత్తిరాజేరు మండలాల పరిధిలో ఉన్న భూములను పరిశీలించారు. యూనివర్శిటీ ఏర్పాటు అక్కడే ఖరారైంది. వచ్చే నెలలో గిరిజన యూనివర్సిటీ నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నారు. మండలం సాలూరు నియోజకవర్గంలో ఉన్నందున, యూనివర్సిటీ గిరిజన ప్రాంతంలో వున్నట్లు అవుతుందని నాయకులు చెబుతున్నారు. కానీ కొత్త జిల్లాల ఏర్పాటులో భాగంగా మెంటాడ మండలం విజయనగరం జిల్లాలో విలీనమైంది. అంటే గిరిజన యూనివర్సిటీ గిరిజన ప్రాంతంలో లేనట్లే. ఈ విషయం తెలిసినా డిప్యూటీ సీఎం రాజన్నదొర గాని, ప్రతిపక్ష పార్టీ నాయకులు గాని కిమ్మనకుండా మౌనం వహిస్తున్నారు. కొత్త జిల్లా ఏర్పాటు సమయంలో ఎమ్మెల్యేగా ఉన్న రాజన్నదొర ఆసక్తి కరమైన ప్రకటన చేశారు. మెంటాడ మండలం విజయనగరం జిల్లాలో విలీనమైతే గిరిజన యూనివర్సిటీని సాలూరు ప్రాంతంలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ ప్రభుత్వానికి లేఖ రాశారు. ఆయన చెప్పిన మాట మీద ఆయనే నిలబడలేని పరిస్థితిలో ఆయన ఉన్నారు. పాచిపెంట పి.కోనవలస సమీపంలో రూ.10కోట్లుతో టిటిడి వెంకటేశ్వరాలయాన్ని నిర్మించాలనే ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అది కూడా మావోయిస్టుల ప్రాబల్యం ఉన్న ప్రాంతమనే సాకు వేరొక చోటకు తరలించారు. ఈ ప్రాంత అభివృద్ధికి దోహదపడే కీలక ప్రాజెక్టుల ఏర్పాటు విషయంలో ప్రభుత్వ పెద్దలు చూపుతున్న వివక్షతను ప్రశ్నించలేని స్థాయిలో స్థానిక ప్రజాప్రతినిధులు వున్నారనేది స్పష్టమవుతోంది.

వర్సిటీ తరలింపు వెనుక రియల్ మాఫియా

నాడు టిడిపి ప్రభుత్వం హయాంలో గాని, నేడు వైసిపి ప్రభుత్వం హయాంలో గాని గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుపై ఈ ప్రాంత వాసులను ఊరించి ఉసూరుమనిపించడం వెనుక బలమైన కారణాలే ఉన్నాయి. గిరిజన యూనివర్సిటీ ఏర్పాటుకు సంబంధించి భూముల పరిశీలనకు వచ్చిన సెంట్రల్ యూనివర్సిటీ అధికారుల బృందాన్ని ఒప్పించడంలో స్థానిక ప్రజాప్రతినిధులు ఘోరంగా విఫలమయ్యారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. టిడిపి ప్రభుత్వం హయాంలో నాటి మంత్రులు గంటా శ్రీనివాసరావు, పి.నారాయణ లాబీయింగ్ చేసి యూనివర్సిటీని కొత్తవలసకు తరలించగా, నేడు జిల్లాకు చెందిన అధికార పార్టీ నాయకులు లాబీయింగ్ చేసి మెంటాడ, దత్తిరాజేరు మండలాలకు తీసుకువెళ్ళారు. అప్పటి ప్రభుత్వంలో గాని, ఇప్పటి ప్రభుత్వంలో గాని గిరిజన యూనివర్సిటీని సాలూరు ప్రాంతంలో ఏర్పాటు చేయడం వెనుక రియల్ ఎస్టేట్ మాఫియా బాగా పని చేసింది. అటు టిడిపి, ఇటు వైసిపి నియోజకవర్గ అభివద్ధికి దోహదపడే కీలక ప్రాజెక్టు ల విషయంలో చిత్తశుద్ధితో పని చేయలేదని స్పష్టమవుతోంది.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఆర్థికాభివృద్ధికి బ్యాంకులు కీలకం

ప్రజాశక్తి -కలెక్టరేట్

ఆర్థికాభివృద్ధిలో బ్యాంకులు కీలకమని వివిధ రంగాలకు బ్యాంకులు రుణాలు అందించాలని కలెక్టరు నిశాంత్ కుమార్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన బ్యాంకర్ల సమావేశంలో బ్యాంకుల లక్ష్యాలు, రుణాలు మంజూరుపై సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టరు మాట్లాడుతూ హౌసింగు, విద్య రంగాలకు రుణాలు ఎక్కువగా అందించాలని ఆదేశించారు. మధ్య తరగతి, అల్పాదాయ వర్గాల వారు కూడా గృహనిర్మాణం చేసుకొనేందుకు ఆశక్తి చూపిస్తున్నారని, జిల్లాలో గృహనిర్మాణరంగం అభివృద్ధిలో ఉందని, కావున ఈ రంగంలో రుణాల మంజూరుకు బ్యాంకులు ముందుకురావాలన్నారు. అలాగే విద్యాభివృద్ధి చెందితే సమాజం ఆర్థికంగా బలపడుతుందని, ప్రతి ఒక్కరికీ విద్యను అందుబాటులోనికి తీసుకురావాలని అందుకు అవసరమైన ఆర్థికవనరులను విద్యారుణాల ద్వారా బ్యాంకులు చేకూర్చాలని తెలిపారు. అటవీ ఉత్పత్తులు, ఇతర పంటల సాగుకు రుణాలు అవసరమని, రుణాలు ఉదారంగా మంజూరు చేయాలని కోరారు. ఆర్ఒఎఫ్ఆర్ భూములకు వ్యవసాయ భూములతో సమానంగా రుణాలు మంజూరు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలకు పశు సంవర్ధక యూనిట్ల రుణాలు అందించాలన్నారు. మత్స్యకారులకు, చేనేత కార్మికులకు రుణాలు, ముద్రరుణాలు అందించాలని, జగనన్న తోడు రుణదరఖాస్తులను ఈనెల 27కల్లా పరిష్కరించాలని కలెక్టరు తెలిపారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ జె.ఎల్.ఎన్ మూర్తి మాట్లాడూతూ ప్రభుత్వం అందిస్తున్న వివిధ పథకాలకు సంబంధించి రుణ దరఖాస్తులను బ్యాంకర్లు తిరస్కరించకూడదని, రుణాలు మంజూరులో ఇబ్బందులు ఉంటే సంబంధిత శాఖాధికారులకు, లీడ్ బ్యాంకుకు తెలియజేయాలని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు విరివిగా రుణాలు మంజూరు చేయాలని, పశువుల యూనిట్లు ఏర్పాటుకు ఇది అనువైన సమయమని బ్యాంకర్లు యూనిట్ల ఏర్పాటుకు ప్రోత్సాహమివ్వాలన్నారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ, పశుసంవర్ధక, ఉద్యాన, మత్స్యశాఖాధికారులు కె.రాబర్ట్ పాల్, ఎ.ఈశ్వర రావు, కెఎస్ఎన్ రెడ్డి, వేమూరి తిరుపతయ్య, డిఆర్‌డిఎ పీడీ కిరణ్ కుమార్, టిపిఎంయు ఎపిడి వై.సత్యం నాయుడు, జిల్లా పరిశ్రమల అధికారి పి.సీతారామ్, ఇతర బ్యాంకుల నియంత్రణ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళా పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్

కలెక్టరేట్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఉపాధికల్పనలో భాగంగా పదో తరగతి నుంచి యుజి, పిజి కోర్సుల్లో ఉత్తీర్ణత సాధించి 18 నుంచి 30ఏళ్ల మధ్య గల నిరుద్యోగ యువతకు ఈనెల 19న నిర్వహించిన జాబ్‌మేళా పోస్టర్‌ను కలెక్టర్ నిశాంత్ కుమార్ నిర్వహించారు. ఈ మెగా జాబ్ మేళకు 14 కంపెనీ ప్రతినిధులు హాజరయ్యి అర్హత కలిగిన అభ్యర్థులను వారి కంపెనీలో ఎంపిక చేసుకోవడం జరుగుతుందని, కావున ఆసక్తి గల నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఎపిఎస్ఎస్‌డిసి జిల్లా నైపుణ్య అభివృద్ధి అధికారి యు.సాయి కుమార్ కోరారు.

జగనన్న విదేశీ విద్యా దీవెనకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి -పార్వతీపురం

జగనన్న విదేశీ విద్యాదీవెన కింద ఆర్థిక సహాయం పొందేందుకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాలు, సంక్షేమం, సాధికారత అధికారి ఎండి గయాజుద్దీన్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ పథకం కింద ప్రపంచంలో టాప్ 200లోపు క్యూఎస్ వరల్డ్ ర్యాంకుల్లో ఉన్న విదేశీ విశ్వవిద్యాలయాలు/విద్యా సంస్థల్లో పీజీ, పీహెచ్‌డి, ఎంబిబిఎస్ అభ్యసించాలనుకునే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ, ఈబీసీ, కాపు విద్యార్థులకు ప్రభుత్వం ఆర్థిక సాయం చేస్తుందని చెప్పారు. ఈ వర్గాలకు చెందిన 35 ఏళ్ల లోపు వారు జగనన్న విదేశీ విద్యాదీవెనకు దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. డిగ్రీ, పిజీ, ఇంటర్మీడియట్‌లో 60 శాతం మార్కులు, తత్సమాన గ్రేడ్‌ను కలిగి ఉండాలని ఆయన పేర్కొన్నారు. ఎంబిబిఎస్ కోర్సుకు నీట్‌లో అర్హత సాధించి ఉండాలని, ప్రపంచంలో టాప్ 100లోపు ర్యాంకు గల విశ్వవిద్యాలయాలు/విద్యా సంస్థలలో ప్రవేశం పొందితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటి విద్యార్థులకు ప్రభుత్వమే 100 శాతం లేదా రూ. 125.00 లక్షల ఫీజు ఏది తక్కువ అయినచో దాన్ని చెల్లిస్తుందని వివరించారు. ఇతర వర్గాలకు రూ. 100 లక్షల వరకు ఏది తక్కువ అయినచో మరియు 101 నుంచి 200 లోపు ర్యాంకు కలిగిన వాటిలో అడ్మిషన్ పొందితే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటి విద్యార్థులకు 100 శాతం లేదా రూ. 75 లక్షల ఫీజు, ఏది తక్కువ అయితే దాన్ని ఇతర వర్గాలకు 50శాతం ఫీజు, రూ.50లక్షలు ఏది తక్కువ అయితే ఆ ఫీజ్ ను ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. అర్హులైన విద్యార్థులు జూన్ 10 లోగా http://jnanabhumi.ap.gov.in ద్వారా దరఖాస్తు చేయాలని అన్నారు.

ప్రచార జాతాను జయప్రదం చేయండి

ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ వెల్లడి

ప్రజాశక్తి - కలెక్టరేట్

రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ కార్మికులు ఎదుర్కొంటున్న ఆర్థిక, సామాజిక ఇబ్బందులను పరిష్కరించాలని, వారి నైతిక భద్రత కోసం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ప్రచార జాతను జయప్రదం చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్, ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు అనుబంధం) కార్యకర్తలకు, సభ్యులకు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో యూనియన్ జిల్లా కార్యదర్శి ఎన్.వై. నాయుడు, సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు, కోశాధికారి జి.వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యులు జాతకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎన్వై నాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలోని 123 కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలను కలుపుతూ ఈనెల 31న ఇచ్చాపురంలో ప్రారంభమై జూన్ 7 విజయవాడలో ముగిసేలా చేపడుతున్న ప్రచార జాత పార్వతీపురం మన్యం జిల్లాలో ఈనెల 31న పాలకొండ, పార్వతీపురం, సాలూరు ప్రాంతాల్లో గల మున్సిపల్ కార్యాలయం వద్ద ప్రచార జాత

జాతా కరపత్రాలను విడుదల చేస్తున్న మున్సిపల్ కార్మిక, ఉద్యోగ సంఘ నాయకులు

సభలు జరుగుతాయని తెలిపారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అమలు పరుస్తూ ఒక పార్వతీపురం మన్యం జిల్లాలోనే 11మంది కాంట్రాక్టు ఉద్యోగులను ఆప్కాస్ నిబంధన వల్ల ఉద్యోగులు వేయడం లేదని విమర్శించారు. ప్రస్తుతం రాష్ట్రంలో జనరల్ ఫండ్ లేవనే కారణంతో మున్సిపల్ కార్మికులకు ఇవ్వవలసిన సబ్బులు, నూనెలు, యూనిఫామ్, పనిముట్లు నిలిపివేయడం దారుణమని అన్నారు. వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. జగన్మోహన్ రెడ్డి పాదయాత్ర సందర్భంగా ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకుంటే జాత అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన ఉధృతం చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ఆఫీస్ బ్యారర్ల సభ్యులు టి.శంకర్, సి.హెచ్.సంజీవి, సింహాచలం, ఎన్.మల్లేష్, టి.వెంకటరావు మహిళా కన్వీనర్ టి ఇందు పాల్గొన్నారు.

19న విద్యార్థులకు, హెచ్ఎంలకు సత్కారం

ప్రజాశక్తి-పార్వతీపురం

పదో తరగతి పరీక్షల్లో శత శాతం ఫలితాలు సాధించిన ప్రధాన ఉపాధ్యాయులు, ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు సత్కార కార్యక్రమం ఈనెల 9న నిర్వహిస్తున్నట్లు డిఇఒ ఎన్.ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ మేరకు బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 19న ఉదయం 10 గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లాలో 40 పాఠశాలలు శత శాతం ఉత్తీర్ణత సాధించాయని చెప్పారు. నాలుగు గిరిజన గురుకులాలు, 22 ప్రభుత్వ గిరిజన ఆశ్రమ పాఠశాలలు, 10 జిల్లా పరిషత్ పాఠశాలలు, ఒక ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మూడు కె.జి.బి.వి పాఠశాలలు ఉన్నాయని వివరించారు. 13 మంది ఎస్‌టి విద్యార్థులు 560కు పైగా మార్కులు సాధించారని అందులో కురుపాం మండలం మొండెంఖల్లు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి ఆరిక జ్యోత్స్న 571 మార్కులు, సీతంపేట ప్రభుత్వ గిరిజన సంక్షేమ శాఖ పాఠశాల విద్యార్థి పలకా గురునాథ్ 571 మార్కులు సాధించారని పేర్కొన్నారు. ముగ్గురు ఎస్‌సి విద్యార్థుల్లో - బలిజిపేట మండలం పెదపెంకి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి పెంకి లిఖిత 576, పార్వతీపురం కొత్తవలస కె.పి.ఎం.పి.ఎల్ ఉన్నత పాఠశాల విద్యార్థి నక్కిడపు ప్రేమ్ చరణ్ 576, భామిని ఎపిమోడల్ స్కూల్ బిడ్డిక మణికంఠ 562 మార్కులు సాధించారన్నారు. 21 మంది బిసి, ఇతర తరగతులకు చెందిన విద్యార్థులు 575 కు పైగా మార్కులు సాధించారని వివరించారు. పాలకొండ ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి పాడి హేమలత 587, దూడి తబిత 586, సాలూరు జ్యోతిబాయ్ పూలే గురుకుల పాఠశాల విద్యార్థి కర్రి షర్మిల, కురుపాం మోడల్ స్కూల్ విద్యార్థి కర్రి తనుశ్రీ 585 చొప్పున సాధించారని ఆయన వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఇన్ ఛార్జ్ మంత్రి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ప్రజా ప్రతినిధులు, కలెక్టర్, పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

గ్రామాలను పరిశీలిస్తున్న ఐటిడిఎ పిఒ కల్పనకుమారి, సబ్‌కలెక్టర్ నూరుల్‌కమర్

రెవెన్యూ గ్రామాల మార్పునకు చర్యలు

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని పలు పంచాయతీల్లో గృహ నిర్మాణాల కోసం ఎదుర్కొంటున్న భూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకొంటామని ఐటిడిఎ పిఒ కల్పన కుమారి అన్నారు. బుధవారం మర్రిపాడు పంచాయతీలోని మర్రిగూడ, మూలగూడ, పెద్దగూడ గ్రామాలను సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్‌తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ అటవీ స్థలాల్లో ఇళ్ల మంజూరైన వారి స్థలాలను రెవెన్యూ స్థలాలుగా మార్చుటకు చర్యలు తీసుకొంటామని అన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ నర్సింహులు, సర్పంచ్, ఇతర రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఉష్ కాకి

మూలుగుతున్న నిధులు

ప్రజాశక్తి - పాలకొండ

ప్రతి ఏటా నగర పంచాయతీ నుంచి పట్టణంలో వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాలు ప్రారంభించేవారు. ఏప్రిల్ నెలాకరుకు ఇవి ప్రారంభమయ్యేవి. అయితే ఈ ఏడాది మేలో సగం నెల పూర్తయినా ఇంకా చలివేంద్రాలు ప్రారంభం కాలేదు. అసలే ఎండలు మండిపోతున్నాయి. ప్రజలు దాహంతో అల్లాడుతున్నారు. ప్రధాన కేంద్రాల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాల్సి ఉన్నప్పటికీ ఆ బాధ్యతను మరిచారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

మూలుగుతున్న నిధులు...

చలివేంద్రాల ఏర్పాటు లక్షలు రూపాయలు నిధులు కేటాయించారు. అందుకు నగర పంచాయతీ పాలకవర్గ తీర్మానంలో కూడా ఆమోదించారు. అయినప్పటికీ ఒక చలివేంద్రం కూడా ఇంత వరకు ఏర్పాటు చేయలేదు. దీనిపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. పట్టణంలో ఇంత వరకు చలివేంద్రాలు ఏర్పాటు చేయకపోవడానికి కారణం ఏమిటని పట్టణ వాసులు ప్రశ్నిస్తున్నారు. చలివేంద్రాల్లేక ప్రజలు దాహాన్ని తీర్చుకోవడానికి ఎక్కడ కుళాయి నీరు ఉంటే అక్కడ తాగుతున్నారు.

నర్సిపురంలో ఫ్యామిలీ డాక్టర్

వీరఘట్టం : మండలంలోని సంత నర్సిపురంలో బుధవారం 104 ఆధ్వర్యంలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య అధికారి పి.ఉమామహేశ్వరి జ్వర పీడితులు, మధుమేహం, రక్తపోటు, గర్భిణీలకు వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్ నవోనమ్మ, టెక్నీషియన్ దినేష్, ఎంఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు 104 పైలెట్ అనిల్ తదితరులు పాల్గొన్నారు.

తోటపల్లి కాలువ లైనింగ్ పనులను పరిశీలిస్తున్న ఎస్ఇ సుధాకర్

ఖరీఫ్ నాటికి లైనింగ్ పనులు పూర్తి : ఎస్ఇ

ప్రజాశక్తి - వీరఘట్టం

రాబోయే ఖరీఫ్ సీజన్ నాటికి లైనింగ్ పనులు పూర్తి చేయాలని జల వనరుల శాఖ ఎస్ఇ పి.సుధాకర్ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు బుధవారం మండలం పరిధిలోనే రాజపురం, కత్తులకవిటి, హుస్సేన్‌పురం గ్రామాల వద్ద జరుగుతున్న తోటపల్లి ప్రధాన ఎడమ కాలువ ఆధునీకరణ పనులు పరిశీలించిన సందర్భంగా మాట్లాడారు. నాణ్యతతో కూడిన పనులు చేయాలని గుత్తేదారిని ఆదేశించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు లేకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. వెంకటాపురం వద్ద జరుగుతున్న మట్టి పనులు కూడా పరిశీలించారు. ఆయనతో పాటు ఇఇ డి.రవికుమార్, డిఇలు బి.శంకర్రావు, డివి రమణ, కాంట్రాక్ట్ ప్రతినిధి మోహన్ బాబు, వాసు, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి ప్రభుత్వ ఉద్యోగులు రిలే నిరాహార దీక్షలు

ప్రజాశక్తి- పార్వతీపురం రూరల్

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో గత నాలుగేళ్లుగా విఫలమవుతున్న ప్రభుత్వ విధానాలకు నిరసనగా ఈనెల 22 నుండి పార్వతీపురం మన్యం జిల్లా నియోజకవర్గ కేంద్రాల్లో రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తున్నట్లు ఆ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కార్యదర్శి జిల్లా ఎం.సింహాచలం తెలిపారు.. జిల్లాస్థాయిలో బుధవారం పార్వతీపురంలో నిర్వహించిన ఆ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రభుత్వం ఉద్యోగు సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చిన ప్రస్తుత ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టినప్పటికీ సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంతో వ్యవహరిస్తున్నారని విమర్శించారు. అందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం తీసుకున్న నిర్ణయం మేరకు ఈనెల 22న పార్వతీపురం లోను, 23న సాలూరు, 24న కురుపాం, 25న పాలకొండ నియోజకవర్గ కేంద్రాలలో తమ సంఘం రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్టు తెలిపారు. ఈ నిరసనలను భవిష్యత్తులో మరింత తీవ్రతరం చేయనున్నట్టు తెలిపారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా నాయకులు మరడ సింహాచలం, ఉరిటి శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహార కిట్లు పంపిణీ

ప్రజాశక్తి - సీతంపేట

ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం జిల్లా ఆధ్వర్యంలో సీతంపేట సామాజిక ఆసుపత్రిలో జాతీయ క్షయ నివారణ కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి టిబి ముక్తా భారత్ అభియాన్ కార్యక్రమంలో క్షయవ్యాధి బాధితులకు పౌష్టికార కిట్లను పంపిణీ చేశారు. శ్రీకాకుళం రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్‌మోహన్‌రావు, ఆర్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ సౌజన్యంతో సమకూర్చిన ఆహారపు కిట్లను అందించారు. కార్యక్రమంలో రెడ్ క్రాస్ చైర్మన్ పి.జగన్ మోహన్‌రావు మాట్లాడుతు రోగులు కోలుకోవడానికి పోషక ఆహారకిట్లు అందిస్తున్నామని, టిబి నుంచి రక్షించుకోవడానికి ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలని విషయాలను తెలిపారు. రెడ్ క్రాస్ మన్యం జిల్లా చైర్మన్ ఎం.శ్రీరాములు మాట్లాడుతూ పౌష్టికాహార కిట్లు 6మాసాల వరకు అందజేస్తామన్నారు. స్థానిక ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా క్షయ వ్యాధి బాధితులకు నాణ్యమైన మందులు అందించబడుతున్నాయని, వాటిని సక్రమంగా వాడి సాధారణ జీవితంలోకి అడుగు పెట్టాలని అన్నారు. జిల్లా క్షయ, ఎయిడ్స్, టిబి నివారణ జిల్లా అధికారి డాక్టర్ ఎ.శ్యామ్ కుమార్ మాట్లాడుతూ మన్యం జిల్లాలో 600 మంది బాధితులు ఉన్నారని వీరందరికీ దఫా దఫాలుగా దాతలు సహకారంతో అందజేయడానికి ప్రణాళిక చేస్తామన్నారు. ఆర్ట్స్ స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధి ఎం.రవీంద్రనాథ్ మాట్లాడుతూ 30 ఏళ్ల నుంచి నుంచి సంస్థ గిరిజనులకు సేవా కార్యక్రమాలు చేస్తుందని, భవిష్యత్తులో కూడా కొనసాగిస్తామని అన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ విజయపార్వతి, రెడ్ క్రాస్ వాలంటీర్లు బి.చిన్మయిరావు, పి.చైతన్యకుమార్, కె.సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



కుష్టురోగులకు పౌష్టికాహార కిట్లును పంపిణీ చేస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్లు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే జోగారావు

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

పార్వతీపురం టౌన్ : పట్టణంలోని జగన్నాధపురం ప్రాంతంలో గల 1వ వార్డు పరిధిలో దూబాగడ్డి వీధి, కష్ట కాలనీ, గానీ వీధి మరియు గేదెల వీధులలో నూతనంగా సిసి రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలకు సంబంధించిన అభివృద్ధి పనులకు స్థానిక ఎమ్మెల్యే అలజంగి జోగారావు బుధవారం శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ప్రాంతంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా స్థానిక ప్రజలు తమకు సిసి రోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని ఆ వార్డు ప్రజలు ఎమ్మెల్యేను కోరగా రూ.10 లక్షల నిధులతో ఈ పనులను ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. రోడ్ల నిర్మాణంతో పాటు, కాలువ నిర్మాణాలు చేస్తున్నామన్నారు. అలానే స్థానికంగా ప్రజలు చెప్పిన పాత విద్యుత్ స్తంభం మార్పిడి, అమ్మవారి గుడికి రోడ్డు వంటి కొన్ని సమస్యలకు తప్పక పరిష్కారమవుతుందని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొండలపు బాలకృష్ణ, కౌన్సిలర్ రణభేరి బంగారు నాయుడు, నాయకులు రణభేరి చిన్నమనాయుడు, సంఘం రెడ్డి లక్ష్మీనార్సింహ, కో-ఆప్షన్ సభ్యులు మెరువ వెంకట్రావు, వైసిపి సీనియర్ నాయకులు బత్తుల శ్రీనివాసరావు, సువ్వాడ శ్రీనివాసరావు, ఎస్ సందీప్ కుమార్, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

టిడిపితోనే గిరిజన గ్రామాల అభివృద్ధి

పాచిపెంట : టిడిపి ప్రభుత్వంతోనే గిరిజన గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు గుమ్మడి సంధ్యారాణి తెలిపారు. మండలంలోని గరిసిగుడ్డి, మూటకూడు పంచాయతీల్లో గల జీలికవలస గిరిజన గ్రామంలో ఇదేమి కర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుత వైసిపి ప్రభుత్వ పాలనలో గిరిజన గ్రామాల అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందని, ప్రభుత్వం నుండి గిరిజనులకు రాయితీలపై అందాల్సిన సంక్షేమ పథకాలు సక్రమంగా అందడం లేదని గిరిజన యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం లేదని అన్నారు. రానున్న ఎన్నికల్లో టిడిపిని గెలిపించి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముఖి సూర్యనారాయణ, పాంచాలి సర్పంచ్ యుగంధర్, పాచిపెంట ఎంపిటిసి సభ్యులు పి.ఉమామహేశ్వరరావు, చల్లా కనక, పి.నరసింగరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

గ్రామస్తులతో మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ జగన్నాధరావు

రెడ్డివానివలసను సందర్శించిన డిఎంహెచ్ఒ

సీతానగరం : మండలంలోని రెడ్డివానివలసను బుధవారం జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాధరావు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన గ్రామంలో జర్వాల గురించి ఇంటింటికి వెళ్లి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పంచాయతీ సర్పంచ్ పెంట సత్యనారాయణను పారిశుధ్యం నుంచి తాగునీరు గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి ఇంటికి వెళ్లి పరిస్థితి గురించి సర్వే చేసి సర్వే చేశారు. కార్యక్రమంలో సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి కె.శిరీష వైద్య సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు. రెండో రోజు గ్రామంలో వైద్య శిబిరాన్ని కొనసాగించారు.

సదస్సులో మాట్లాడుతున్న రామకిరణ్

గోగు రైతులకు అవగాహన

బలిజిపేట : మండలంలోని మిర్తివలస రైతు భరోసా కేంద్రంలో గోగు పంట ఉత్పత్తి, విత్తన ఎంపికపై గోగు రైతులకు అవగాహన సదస్సు జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా మార్కెటింగ్ మేనేజర్లు రామకిరణ్, చంద్రశేఖర్, మండల వ్యవసాయ అధికారి శ్రావణ్ కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గోగులో తోసా రకమైన జెఆర్ఒ-204 పంట రకం ఎకరానికి కిలో విత్తనం (సబ్సిడీలో), డ్రమ్‌సీడర్‌తో వరుసల క్రమంలో విత్తుకోవాలి వాటికి సంబంధించిన సీడర్‌ను అందిస్తామని అన్నారు. ఇది 90రోజులకు పంట కోతలు దశకు, ఊరవేతకు వస్తుందని, జూట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా వారు పంట మద్దతు ధరకు నారను కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. ఆసక్తిగల రైతులు ఈ అవకాశాన్ని వినియోగం చేసుకోవాలని కోరారు.

టిడిపి కార్యకర్తకు నివాళి

పార్వతీపురం రూరల్: మండలంలోని ములగ పంచాయతీ బిల్లగుడ్డివలస మాజీ సర్పంచ్ కేంద్రుక సన్యాసి సోదరుడు, సీనియర్ తెలుగుదేశం కార్యకర్త అయిన కేంద్రుక కుంబులు బుధవారం వేకువ మృతి చెందారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులు గొట్టాపు వెంకట్ నాయుడు, హాస్పిటల్ మాజీ కమిటీ చైర్మన్ రెడ్డి చిన్నమనాయుడు, బుడితి శ్రీరాములు కుంబులు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు.

విద్యార్థులకు అభినయ గేయాలు దోహదం

పాలకొండ: స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం పదవ రోజు అభినయ గేయాలతో విద్యార్థులకు ఉత్సాహమని తంపంటాపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు రాష్ట్ర ఉత్తమ అవార్డ్ గ్రహీత కె. జనార్ధనరావు అన్నారు. విద్యార్థుల్లో ఉండే సృజనాత్మకత వెలికి తీయడానికి అభినయ గేయాలు ఉపయోగపడతాయని, ఈ గేయాలు నేర్చుకోవడంలో విద్యార్థుల్లో ఉత్సాహం, ఆనందం, ఆరోగ్యం, ప్రతిభ, తెలివి, జ్ఞాపక శక్తి పెరుగుతుందన్నారు. డ్రాయింగ్ టీచర్ జి.మురళీకష్ణ పనికిరాని వస్తువులతో బొమ్మలు ఎలా తయారు చేయాలో నేర్పించారు. కార్యక్రమంలో ఇంఛార్జి గ్రంథాలయ అధికారి బబ్బురు గణేష్ బాబు సహాయకుడు ఈశ్వర్ పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో విజ్ఞానం

సీతంపేట : స్థానిక శాఖా గ్రంథాలయం సీతంపేటలో వేసవి విజ్ఞాన శిబిరం బుధవారానికి పదో రోజు పిల్లలు గ్రంథాలయాలకు వచ్చి విజ్ఞాన పరమైన పరిజ్ఞానం పుస్తకాలు చదివారు. ఎక్కువ మంది విద్యార్థినిలు పాల్గొన్నారు. సహాయకుడు రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినయ గేయాలను నేర్పిస్తున్న జనార్ధనరావు

నవధాన్యాల సాగుతో భూమి సారవంతం

రైతులకు నవధాన్యాల విత్తనాలను అందజేస్తున్న ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ షణ్ముఖరావు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

నవధాన్యాల సాగు వల్ల భూమి సారవంతమవుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్ పి. షణ్ముఖరావు అన్నారు. బుధవారం పార్వతీపురం మండలం పులిగుమ్మి పంచాయతీ పరిధిలోని లచ్చిరాజుపేట రైతులతో నవధాన్యాలు సాగుపై ఆర్బీకే కె ప్రకాష్‌తో కలిసి అవగాహన కల్పించారు. ప్రకృతి వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించడానికి 10 నుంచి 30రకాల విత్తనాలు, నవ ధాన్యాలు వేయడంతో సాధ్యం పడుతుందన్నారు. ప్రధాన పంటకు కావాల్సిన అన్ని రకాల పోషకాలు భూమిలో ఈ నవ ధాన్యాలు సాగు వల్ల లభ్యమవుతుందని తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు ఆరు జిల్లాల పరిధిలో తొలకరి వర్షాలు పడే ముందు ఎకరాకు 10కేజీలు చొప్పున అన్ని రకాల విత్తనాలు కలుపుకొని భూమిలో వేయడానికి ప్రణాళికలు సిద్ధం చేశామని తెలిపారు. కార్యక్రమంలో రీజనల్ టెక్నికల్ కో-ఆర్డినేటర్, డివిజనల్ ఎంకర్ పర్సన్ రైతులు, కార్యకర్తలు, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

కురుపాం : మండలంలోని నీలకంఠాపురం ఆర్‌బికె పరిధిలో గల రైతులకు ప్రకృతి వ్యవసాయంలో భాగంగా జట్టు సంస్థ ఆధ్వర్యంలో పిఎండిఎస్ విత్తనాలు సర్పంచ్ ఎ.మన్మథరావు బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన పంటలకు ముందుగా ఈ నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమి సారవంతమై పంట దిగుబడి వస్తుందన్నారు. దీనివల్ల ఎరువులు లేని పంటలు పండించుకో వచ్చన్నారు. అనంతరం 30 రకాల విత్తనాలు ఒక్కొక్క రైతుకు 12 కేజీలు చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో జట్టు సంస్థ సిబ్బంది చందలాల్, గంగాధర్ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

పాచిపెంట: అధిక మోతాదులో రసాయన ఎరువులు వాడితే ఖర్చులు మాత్రమే పెరుగు తాయని, దిగుబడులు పెరగాలంటే భూమిలో సేంద్రీయ కార్బన్ శాతం పెరగాలని, దీనికి ఏకైక పరిష్కారం నవధాన్య పచ్చిరొట్ట విత్తనాలని మండల వ్యవసాయాధికారి కె.తిరుపతిరావు అన్నారు. మండలంలోని రాయిగుడివలస రైతు భరోసా కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన రైతుల సమావేశంలో మాట్లాడుతూ ప్రస్తుతం భూమిలో సేంద్రీయ కార్బన్ 0.01 శాతం మాత్రమే ఉందని, దీన్ని కనీసం ఒక్క శాతానికి పెంచినప్పుడే వ్యవసాయానికి యోగ్యమైన భూములుగా పరిగణించవచ్చని తెలిపారు. సేంద్రీయ కర్బనం పెరగాలంటే ఏకైక పరిష్కారం నవధాన్య పచ్చిరొట్ట విత్తనాలను కలిగి ఉండడమే అని అన్నారు. ఎకరానికి 12 కిలోల నవధాన్య పచ్చిరొట్ట విత్తనాలను జల్లుకోవాలని భూముల సత్తువను పెంచవచ్చని తెలిపారు. కావున రైతులంతా నవధాన్య పచ్చిరొట్ట విత్తనాలను కలియ దున్నాలని కోరారు. కార్యక్రమంలో విఎఎ సాయి గణేష్, ప్రకృతి సేద్య సిబ్బంది యశోదమ్మ తిరుపతి నాయుడు నరసింహులు పాల్గొన్నారు

ఇంటర్ ప్రవేశాలకు 31లోగా దరఖాస్తులు

మక్కువ: మండలంలోని అనసభద్ర ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్‌లో ఇంటర్మీడియట్ ప్రవేశం కోసం ఆన్లైన్లో ఈనెల 31 లోగా దరఖాస్తులు చేసుకోవాలని ప్రిన్సిపల్ బి.ఎర్రునాయుడు తెలిపారు. ఎంపిసి, బైపిసి, ఎంఇసి గ్రూపుల్లో ప్రవేశాలకు గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆయన తెలిపారు.

ఎ.వెంకంపేటలో వైద్య శిబిరం

రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

మక్కువ : మండలంలోని ఎ.వెంకంపేట పంచాయతీలో మెగా వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. టిడిపి మండల పార్టీ మాజీ అధ్యక్షులు పెంట తిరుపతిరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. అనిల్ నీరుకొండకు చెందిన పలమనాలజిస్ట్ డాక్టర్ సాండ్ ఆధ్వర్యంలో వైద్య చికిత్స నిర్వహించారు. సుమారు 250 మంది హాజరు కాగా, ఇందులో 11మందిని మోదుగుల సంఘ వలస ఆస్పత్రులకు రిఫర్ చేశారు. జనరల్ మేనేజర్ నవీన్, అసిస్టెంట్ మేనేజర్ త్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

తూరుమామిడిలో పారిశుధ్య పనులు

మక్కువ : మండలంలోని తూరుమామిడి పంచాయతీలో బుధవారం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. స్థానిక సర్పంచ్ ఆర్.కృష్ణంనాయుడు ఆదేశంతో పంచాయతీ కార్యదర్శి సురేష్ పారిశుధ్య పనులు చేపట్టారు. మినీ జెసిబితో కాలువల్లో పేరుకుపోయిన చెత్తాచెదారాలను తొలగించారు. అలాగే మురుగునీరు ప్రవాహానికి ఆటంకం లేకుండా చర్యలు చేపట్టారు.

బాగువలస విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తున్న ఉపాధ్యాయులు

ప్రభుత్వ బడుల్లో పిల్లల చేర్పింపు

ప్రజాశక్తి - సాలూరు

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించడానికి సంబంధించిన ప్రత్యేక కార్యక్రమంలో (ఎన్రోల్మెంట్ డ్రైవ్) భాగంగా మండలంలోని బాగువలస జెడ్పీ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు సమీప గ్రామాల్లో పర్యటించారు. హెచ్‌ఎం టి.జేమ్స్ ఆధ్వర్యాన ఉపాధ్యాయులు బాగువలస, గాదెలవలస, పాలికవలస, పెదపధం గ్రామాల్లో తిరిగి తల్లిదండ్రులను కలిశారు. బడి ఈడు పిల్లలను తమ పాఠశాలలో చేర్పించాలని ఒప్పించే ప్రయత్నం చేశారు. ప్రభుత్వ పాఠశాలలో గల మౌలిక సదుపాయాలు, జగనన్న గోరుముద్ద, విద్యా దీవెన, విద్యా కానుక వంటి పథకాలు, బోధన జరుగుతున్న తీరు గురించి వివరించారు. ఈ సందర్భంగా 23మంది విద్యార్థులను బడిలో చేర్పించారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ రెడ్డి సుకన్య, ఉపాధ్యాయులు జె.రామునాయుడు, కె.జయ, ఎన్.గోవింద, పిడి నిర్మలారాణి, సిఆర్‌పి ఎ.ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

పాలకొండ రూరల్: ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో భాగంగా మండలంలోని అంపిలిలో వైస్ ఎంపిపి వాకముడి అనిల్‌కుమార్ ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ లోలుగు విశ్వేశ్వరావు, గ్రామ పెద్దలు చింత సంగంనాయుడు, బూరాడ తేజేశ్వరరావు, ఎస్ఎంసి చైర్మన్ శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామ యూత్ సభ్యులు కలిసి బడిఈడు పిల్లలు అందరు బడిలో ఉండాలని అన్నారు. ఇంటి ఇంటికి వెళ్లి గ్రామంలో భారీ ర్యాలీ చేపట్టారు. 10మంది విద్యార్థులను బడిలో చేర్పించారు.

హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - పాలకొండ రూరల్

నగర పంచాయితీలో గల కోటదుర్గ అమ్మ వారి దేవస్థానంలో గల హుండీలను బుధవారం తెరిచి లెక్కించారు. మార్చి 20 నుండి ఈనెల 17 వరకు (58 రోజులుకు)గాను రూ:7,20,305 ఆదాయం వచ్చింది. బంగారం 0.138.000 గ్రాములు, వెండి కేజి 3.550.000 గ్రాములు హుండీల ద్వారా వచ్చినది. సదరు లెక్కింపు జిల్లా దేవదాయశాఖ అధికారి ప్రసాదరావు, సాలూరు గ్రూప్ దేవాలయముల కార్యనిర్వాహణాధికారి ఎం.ప్రసాద్ పర్యవేక్షణలో ఆలయ ఇఒ సమక్షములో జరిగింది. సదరు లెక్కింపునకు ఆలయ ప్రధానార్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

సీతంపేట : మలాథియేన్ స్ప్రేయింగ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

మలేరియా నివారణపై అవగాహన అవసరం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మలేరియా వ్యాధి నివారణకు ప్రజలంతా అవగాహన కలిగి ఉండాలని భద్రగిరి మలేరియా సబ్ యూనిట్ అధికారి ఎం.మోహన్, తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఎం. బుద్దేశ్వర రావు తెలిపారు. ఈనెల 15 నుంచి గిరిజన గ్రామాల్లో ఎసిఎం 5% స్ప్రేయింగ్ పనులను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వీరు గిరిజన ప్రజలతో మాట్లాడుతూ, మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాల్సిన బాధ్యత ఉందన్నారు. మలేరియా వ్యాధి రాకముందే తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం, వైద్య ఆరోగ్యశాఖ అధికారులు గిరిజన గ్రామాల్లో మలేరియా నివారణకు ఎసిఎం 5% మందును స్ప్రేయింగ్ చేపడుతున్నారని అన్నారు. కావున ప్రతి ఒక్కరూ తమ ఇళ్లల్లోనూ, బయట ప్రాంతాల్లో ఎసిఎం 5% మందును స్ప్రేయింగ్ చేయించుకోవాలని కోరారు. ఈ మేరకు బుధవారం రెళ్ల సచివాలయం పరిధిలో కేసరి, కుంబిగూడ, కేదారిపురం గ్రామాల్లోనూ, అలాగే కేదారిపురం సచివాలయం పరిధిలో డోలుకోన, కేదారిపురం, కేడి కాలనీ, గిరిజన సంక్షేమ బాలికల ఆశ్రమ పాఠశాలలో దోమల నివారణ మందును పిచికారీ చేయించాలన్నారు. ఈ స్ప్రేయింగ్ పనులను తాడికొండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సిబ్బంది, కేదారిపురం సర్పంచ్ ఎం.తులసమ్మ, భద్రగిరి మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ జి.అప్పలనాయుడు, ఆరోగ్య కార్య కర్తలు పి.రాధాకష్ణ, మలేరియా సూపర్వైజర్లు, ఎమ్మెల్ హెచ్‌పి, పంచాయతీ కార్యదర్శి, వాలం టీర్లు, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

సీతంపేట : మండలంలో తుంబకొండ, వాసింగి, ఘాటి గుమ్మడ తదితరు గ్రామాల్లో సబ్ యూనిట్ అధికారి మోహన్‌రావు ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా మలేరియా అధికారి శ్యాంకుమార్, అసిస్టెంట్ మలేరియా అధికారి సూర్యనారాయణ సందర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ స్ప్రేయింగ్ వ్యాధులు రాకుండా రక్షణ కవచం లాగా ఉంటుందని గిరిజనులకు అవగాహన కల్పించారు. అంతేకాకుండా వేసవిలో దోమలు కూడా దరి చేరవని అందుకే మీరు స్ప్రేయింగ్ ను దగ్గరుండి వేసుకొని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. స్ప్రేయింగ్ నిర్వహణ బాగుందని మోహన్ రావు అభినందించారు. ఆయన వెంట మలేరియా టెక్నికల్ సూపర్వైజర్ ఝాన్సీ రాణి, సీదిలో ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమంలో డిఎంఒ శ్యామ్ కుమార్ పాల్గొన్నారు.

గిరిజన గ్రామాలాభివృద్ధికి కృషి

రామభద్రపురం : గిరిజన గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తున్నామని స్థానిక ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. ఎంపిపి చొక్కాపు లక్ష్మణరావు అధ్యక్షతన బుధవారం గొల్లపేట సచివాలయం పరిధిలో ఉన్న గిరిజన గ్రామాలైన జోగిందిర, కర్రిందిరవలస గ్రామాల్లో గడప గడపకు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతీ ఇంటికి వెళ్ళి జగనన్న ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి వివరించారు. ప్రజల సమస్యలు తెలుసుకొని పరిష్కారం కోసం కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గిరిజనుల మెరుగైన జీవనోపాదుల కోసం ప్రభుత్వ రాయితీలు నేరుగా వచ్చేలా కృషి చేయాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి అప్పికొండ సరస్వతమ్మ, వేణుగోపాలనాయుడు, ఆయా గ్రామాల సర్పంచులు, నాయకులు పాల్గొన్నారు.

దళితుల సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు

దళితుల సమస్యలను పరిష్కరించాలని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ ప్రభాకర్ డిమాండ్ చేశారు. బుధవారం పార్వతీపురంలో దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధునాతన కాలంలో దళితులు అనేక ప్రధాన సమస్యలతో కొట్టుమిట్లాడు తున్నారన్నారు. దళితులు ఆర్థికంగా, సామాజికంగా వెనకబడిపోవడం, ఎస్సీ పేటలో మౌలిక సదుపాయాలు కల్పన లోపించాయని ఆందోళన వ్యక్తం చేశారు. దళిత యువత యువకులకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు లేకపోవడం, ప్రైవేట్ రంగంలో రిజర్వేషన్లు కల్పించకపోవడం, దళిత యువతీ, యువకులను ఆదుకునే ఎస్సీ కార్పొరేషన్ ను ఉత్సవ విగ్రహాలుగా మార్చడం, ఎస్సీ ఉద్యోగులను వేధించేలా దాడులు చేయడం హత్యలు చేయడం, దళిత మహిళలపై అత్యాచారాలు, హత్యలు సర్వసాధారణంగా మారాయని విమర్శించారు. ఎస్సీ సబ్ ప్లాన్ అమలు చేయకపోవడం అట్రాసిటీ చట్టాన్ని పగడ్బందీగా అమలు చేయకపోగా, ఉన్న లొసుగులు ఉపయోగించి చట్టాన్ని నిర్వీర్యం చేయడం లాంటివి జరుగుతున్నాయన్నారు. దళితులు పెట్టిన కేసులపైనే తిరిగి కౌంటర్ కేసులు పెట్టి దళితులను వేధించడం, రాష్ట్రంలో సర్వ సాధారణంగా మారిందన్నారు. మాజీ ఎమ్మెల్యే బొబ్బిలి చిరంజీవులు మాట్లాడుతూ దళిత యువకుడ్ని చంపి కారులోనే డోర్ డెలివరీ చేసిన ఎమ్మెల్సీ అనంతబాబుపై ఇంతవరకు చర్యల్లేవన్నారు. మాస్కులు లేవు ప్రభుత్వం సరఫరా చేయాలని అడిగిన డాక్టర్ సుధాకర్ను పిచ్చివాడిని చేసి, రోడ్డుపైనే దాడి చేసి చంపిన ఘటన, ప్రభుత్వ ఉన్నత అధికారి రామకృష్ణను వేధించి హత్య చేయడం ప్రభుత్వ ఉద్యోగులే హత్య గురౌవుతుంటే, సాధారణ దళితుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. దళితులు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను చర్చించి పరిష్కా రాల కోసం భవిష్యత్తు దళిత ఐక్య ఉద్యమ నిర్మాణం చేయలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కూరంగి మన్మధరావు, సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు యమ్మల మన్మధరావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ నాయకులు భాస్కర్ రావు, సామాజిక అభివృద్ధి వేదిక నాయకులు రంజిత్ కుమార్, జనసేన నాయకులు వి.దాలినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ప్రభాకర్

మానవత్వం చాటిన గ్రామ పెద్దలు

ప్రజాశక్తి- మెంటాడ

ఎవరి స్వార్థం వారు చూసుకుంటూ రక్త సంబంధీకులకు సహితం సహకరించని నేటి సమాజంలో ఇంకా మానవత్వం ఉందని జక్కువ గ్రామ పెద్దలు చాటిచెప్పారు. మండలంలోని జక్కువ గ్రామానికి చెందిన మన్నేపూరి నారాయణరావు డిగ్రీ వరకు చదువుకుని ఖాళీగా ఉండడంతో గ్రామ పెద్దల సహకారంతో గ్రామ సచివాలయంలో వాలంటీర్‌గా అవకాశం కల్పించారు. వృద్ధాప్యంలో ఉన్న తన తల్లిదండ్రులను ఆ వచ్చిన జీతంతో కుటుంబాన్ని పోషించుకుంటున్న తరుణంలో తన రెండు కిడ్నీలు పాడైపోయి తల్లిదండ్రులకు భారంగా మారాడు. తన కిడ్నీలు ఆపరేషన్ కోసం సుమారు రూ.10 లక్షలు ఖర్చు అవుతుందని తెలుసుకొని ఏమి చేయాలో తెలియని పరిస్థితిలో కొట్టిమిట్టాడుతుండగా గ్రామ పెద్దలు అండగా నిలిచారు. ఆరోగ్యశ్రీ పథకంలో రూ.5లక్షలు వరకు వస్తాయని మిగతా డబ్బులు మానవతా దృక్పథంతో సహకరించాలని గ్రామానికి చెందిన వైసిపి సీనియర్ నాయకులు, సివిల్ కాంట్రాక్టర్ కుప్పిరెడ్డి మోహన్ రావు కోరుతూ ఆయన రూ. 10వేలు అందించారు. ఆయనతో పాటు మండల వ్యవసాయ సలహా కమిటీ అధ్యక్షులు లచ్చిరెడ్డి అప్పలనాయుడు, జక్కువ పిఎసిఎస్ అధ్యక్షులు రెడ్డి అప్పారావు, కర్రీ అప్పలస్వామి రూ. 5వేలు చొప్పున ఆర్థిక సాయం అందించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ ఎవరైనా మానవత్వం కలిగిన వారు ఆ యువకునికి సహాయం చేయాలని తన పైనే ఆధారపడి బ్రతుకుతున్న తన కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

ఆర్థిక సాయాన్ని అందిస్తున్న గ్రామపెద్దలు

మహారాజశ్రీ పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో
I.P. 3/2023

బిట్వీన్:
రౌతు లక్ష్మణరావు S/o లేటు సింహాచలం నాయుడు, వయస్సు 39 సంవత్సరములు నవిరి కాలనీ, కొత్తవలస పార్వతీపురం మున్సిపాలిటీ, మన్యం జిల్లా. ......పిటిషనర్
And:
బంటు సుధా వగైరాలు ....రెస్పాండెంట్స్

1. బంటు సుధా,	2. మంతిని రాజు,
3. వరలక్ష్మి,	4. శ్రీను
5. టిట్టు	6. కర్రి లవ కుమార్,
7. వావిలిపల్లి గణేష్,	8. ఓలేటి సురేష్,
9. మానాపురం పోలినాయుడు,	10. రౌతు చంద్రశేఖర్,
11. చింతపల్లి చక్రధర్,	12. సతీష్,
13. సంతోష్ కుమార్,	14. మానాపురం వెంకట్ నాయుడు,
15. రవి,	16. బెవర అరుణ,
17. భౌరోతు శ్రీను	18. మానాపురం నరసన్న,
19. బొత్స రామారావు,	20. గొరజాన వెంకట నాయుడు,
21. ఎస్.రాజేశ్వరరావు,	22. ఆర్.హేమలరావు,
23. జి.హరి,	24. నెల్లి ప్రసాద్,
25. గేదెల రాంబాబు,	26. ఎస్.మధు,
27. బలగ గణపతి,	28. రౌతు శంకరరావు,
29. గంట తిరుపతి,	30. జి.అన్నాజీ పాత్రుడు,
31. బక్కు అనిల్,	32. ఆర్.రాంబాబు,
33. ఎం.శంకర్రావు,	34. టి.సరోజినీ,
35. కాశి,	36. డి సంతోష్,
37. ఎం.కిరణ్,	38. ఎం.శివ
39. డి.సుధా,	40. కె.సరస్వతమ్మ,
41. ఆర్.శ్రీనివాసరావు,	42. ఆర్.ప్రసాద్,
43. మర్రాపు శంకరరావు,	44. బి.జయలక్ష్మి,
45. మానాపురం రాజు,	46. బి.నాగరాజు,
47. పి.ఉమ	48. మూటిక జోగారావు,
49. ఎం.సత్యవతి	50. కురసాల దేముడు. వగైరాలు

ఇందుమూలంగా పైన తెలిపిన ప్రతి వాదులకు తెలియజేయునది ఏమనగా పార్వతీపురం మన్యం జిల్లా, నవిరి కాలనీ, కొత్తవలస గ్రామం, పార్వతీపురం మున్సిపాలిటీ గ్రామ కాపురస్తులు అయినా రౌతు లక్ష్మణరావు, S/o లేటు సింహాచలం నాయుడు పైన తెలిపిన ప్రతివాదుల వద్ద నుంచి అప్పు తీసుకుని తీర్చుటకు శక్తి లేని వాడినని తీర్పు చేయమని మరియు పైన తెలిపిన ప్రతివాదుల నుండి రక్షణ కల్పించమని శ్రీ పార్వతీపురం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో I.P.3/2023 పిటిషన్ దాఖలు చేసియున్నాను. కావున పైన తెలిపిన ప్రతివాదులకు ఎవరికైనా ఎట్టి ఆక్షేపణలు ఉన్న ఎడల స్వయంగా గాని, వకీల్ ద్వారా గాని **తే 26.06.2023దిన ఉదయం 10:30 గంటలకు** పైన తెలిపిన కోర్టులో హాజరు కావాలని లేని పక్షములో శ్రీ కోర్టు వారు మీ పరోక్షముగా తీర్మానించడమగునని ఈ ప్రతివాదులకు ఈపత్రికా ప్రకటన ద్వారా తెలియజేయుచున్నాము.

పి.వి.కృష్ణారావు (కాళి)
పిటిషనర్ తరుపు న్యాయవాది, పార్వతీపురం,
సెల్ నంబర్. 9885482133

నేరాలు ఘోరాలు

గాయపడ్డ క్షతగాత్రులు

ఆటో బోల్తా : ఐదుగురికి గాయాలు

ప్రజాశక్తి - కురుపాం/గుమ్మలక్ష్మీపురం:

గుమ్మలక్ష్మీపురం మండలం అచ్చబ గ్రామ సమీపంలో ఘాటు రోడ్డు వద్ద ఆటో బోల్తా ఐదుగురు తీవ్ర తీవ్రగాయాలైన సంఘటన బుధవారం చోటు చేసుకుంది. కురుపాం పోలీసులు అందించిన సమాచారం ప్రకారం ఒడిశా రాయగడ మజ్జి గౌరమ్మ దర్శనానికి వెళ్లి తిరిగి వస్తుండగా గుమ్మలక్ష్మీపురం మండలం అచ్చబ గ్రామ సమీపంలో ఘాటు రోడ్డు మలుపు వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడడంతో కొమరాడ మండలం వన్నాము గ్రామానికి చెందిన ఒకే కుటుంబలో ఐదుగురు గాయపడిన సంఘటన చోటుచేసుకుంది. ఈ సంఘటనలో తీవ్ర గాయాలు తగిలిన ఎస్.అభిలాష్(20), ఎస్.చిన్నారావు (55), ఎస్.మహాలక్ష్మి (25)ని కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు. స్వల్ప గాయాలు తగిలిన ఎస్.గౌరీశ్వరి (45), సీతాదేవ కురుపాం సిహెచ్‌సి ప్రథమ చికిత్స పొందుతున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ ఢీకొని వ్యక్తికి తీవ్ర గాయాలు

పార్వతీపురం రూరల్: మండలంలోని వెంకంపేట పంచాయతీ, వైకెఎం కాలనీ దగ్గర బుధవారం ఉదయం ద్విచక్ర వాహనం ఢీకొని పట్టణానికి చెందిన లాడె ప్రభాకర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు స్పందించి 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించగా, వైద్యులు చికిత్స అందించారు. పరిస్థితి ప్రమాదకరంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం విశాఖపట్నం తరలించారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

తగువు తీర్చేందుకు వెళ్లి...

బలిజిపేట మండలం పెద్దింపేటకు చెందిన మజ్జి దుర్గారావు అనే గ్రామ పెద్ద అదే గ్రామానికి చెందిన మంతిని గౌరీశ్వరరావు అభ్యర్థన మేరకు ఇంటి గోడకు సంబంధించి తగాదా తీర్చేందుకు మంగళవారం వెళ్లారు. అదే గ్రామానికి చెందిన పెంకి శ్రీను, అతని కుమారులు తగువు చెప్పడానికి వచ్చిన పెద్దమనిషి దుర్గారావుపై దాడి చేసి గాయపరిచారు. గ్రామ పెద్దపై దాడి తప్పు అన్నందుకు గౌరీశ్వరరావుపై కూడా వెదురు కర్రతో దాడి చేసి గాయపర్చారు. స్పందించిన గ్రామస్తులు 108 వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.

108 వాహనం ఢీకొని వ్యక్తికి గాయాలు

వంగర మండలం, బాగంపేటకు చెందిన గుణుపూరు తిరుపతిరావు తన సొంత పనుల నిమిత్తం బుధవారం ద్విచక్ర వాహనంపై పార్వతీపురం వచ్చాడు. కొత్తవలస ఫ్లైఓవర్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వెళ్తుండగా, షిరిడి సాయిబాబా మందిరం సమీపంలో వెనుక నుండి వస్తున్న 108 అంబులెన్స్ వాహనం ఢీకొనడంతో ద్విచక్ర వాహనం నుంచి పడిపోయాడు. శరీరానికి పలుచోట్ల గాయాలు కావడంతో అదే వాహనంలో జిల్లా ఆసుపత్రికి తరలించగా వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్ట్ పోలీసులు వివరాలు నమోదు చేశారు.